క్లుప్తంగా

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


బియ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో గురువారం పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో అందరికీ అందుబాటు ధరలో బియ్యం, కంది బేడల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ధరల నియంత్రణలో భాగంగా బియ్యం కిలో రూ.49, కందిబేడలు రూ.160 ప్రకారం అందజేస్తారని చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ నజీర్ అహమ్మద్, కమిషనర్ రమేష్‌బాబు ఉన్నారు.

నాణ్యమైన ఎరువులు, మందులు విక్రయించాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ శ్రీకృష్ణ

రుద్రవరం: రైతులకు నాణ్యమైన రసాయన ఎరువులు, పురుగు మందులను విక్రయించాలని మండల వ్యవసాయాధికారి ఏఓ శ్రీకృష్ణ ఎరువుల దుకాణాదారులకు సూచించారు. మండలంలోని ఆలమూరు గ్రామంలో ఝాన్సీ ఆగ్రో ఏజెన్సీస్ దుకాణంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. నకిలీ ఎరువులు,పురుగు మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆయన దుకాణంలో సరుకు స్టాక్, వాటికి సంబంధించిన రికార్డులు,బిల్లు పుస్తకాలను పరిశీలించారు. పలు రకాల ఎరువుల నమునాలు సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు.

విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ


విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎంఈఓ అనురాధ

చాగలమర్రి: స్థానిక ఓరియంటల్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం నుంచి మంజూరైన యూనిఫాంను 511 మంది విద్యార్థినులకు 3 జతల చొప్పున ఎంఈఓ అనురాధ, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి గురువారం పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో 5,251 మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్ కింద టెక్స్, నోట్‌బుక్, బూట్లు, బ్యాగులు, బెల్ట్‌లు అందజేసినట్లు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్సీ


కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల: నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారిని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా స్థానిక కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఆరోగ్యంపై అవగాహన


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గోస్పాడు: విద్యార్థులు ఆరోగ్య విషయాలపై జాగ్రత్త వహించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోపాల్ పేర్కొన్నారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో గురువారం విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ గోపాల్ మాట్లాడుతూ విద్యార్థినులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ స్వర్ణకుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ పాల్గొన్నారు.

గిరిజనులకు రక్షణ కల్పించండి

నంద్యాల(అర్బన్): కొండ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న గిరిజనులకు చిరుత పులుల నుంచి రక్షణ కల్పించాలని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ కోరారు. ఈ మేరకు గురువారం జీపీఎస్ నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ రాజకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహానంది మండలంలోని గిరిజనులపై చిరుతపులి దాడి చేసిందన్నారు. ఒకే నెలలో రెండు చిరుతలు అడవి ప్రాంతాల్లో తిరుగుతుండటంతో గిరిజనులు భయాందోళనకు గురవుతున్నారని, వారి గూడేలు, స్థావరాల వైపు పులులు రాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు స్వామినాయక్, బాలనాయక్, జనార్ధన్‌నాయక్, కృష్ణనాయక్, రవినాయక్ పాల్గొన్నారు.




ఈ చిత్రంలో ఇద్దరు పిల్లలతో ఉన్న మహిళ పేరు మరియమ్మ, క్రిష్టిపాడు వాసి. ఈమెకు కుమారుడు సంతోష్, కూతురు అక్షర ఉన్నారు. బాబు ఉయ్యాలవాడ మండలం హరివారం ఉన్నత పాఠశాలలో 10త తరగతి చదువుతున్నాడు. కూతురు అక్షర గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. 'తల్లికి వందనం పథకం నా ఇద్దరి పిల్లకు వస్తుందని ఊరంతా చెప్పుకున్నా.. కానీ తల్లికి రూ.15వేలు ఇస్తామని నిన్న చెప్పారంట.. మా కాలనీలో వాళ్లు అంటుంటే విన్నా.. మాకు రూ.30వేలు వస్తుందనుకుంటే ఇప్పుడు రూ.15 వేలే అంటున్నారు.. ఇంత సంబరానికి సూపర్ సిక్స్ అని ఇంటింటికీ కాగితాలు పంచడం దేనికో' అని మరియమ్మ అసహనం వ్యక్తం చేసింది.



మండల కేంద్రం ఉయ్యాలవాడకు చెందిన ఈ మహిళ పేరు జ్యోతి. తనకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. పెద్ద కూతురు మధుమిత శిరివెళ్ల ఏపీ మోడల్ స్కూల్లో పదవ తరగతి చదువుతుండగా రెండో కూతురు స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో 9వ తరగతి, కొడుకు ఎంపీయూపీ స్కూల్లో 7 వతరగతి చదువుకుంటున్నారు. భర్తతో కలిసి కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్న వీరు ముగ్గురు పిల్లలకు ఏడాదికి రూ.45 వేలు తల్లికి వందనం కింద వస్తుందని ఆశలు పెట్టుకున్నారు. అయితే రెండు రోజులుగా ఒక్కరికే ఇస్తున్నట్లు ఊర్లో వాళ్లు అనుకుంటుంటే దిగులు అవుతోందని. ఆ మొత్తం కూడా రావాలంటే చంద్రబాబు ఎన్ని షరతులు పెడుతారో అని అందరూ అంటున్నారు. బాబు హామీ మేరకు.. మాకు సెంటు పొలం లేదు, ఎలాంటి షరతులు పెట్టినా ముగ్గురికి వస్తుందని ఆశ పడ్డాం ఇప్పుడు ఆశ నిరాశ అయ్యేలా ఉందని జ్యోతి ఆవేదన వ్యక్తం చేస్తోంది.

తల్లికి వందనం.. అయోమయం!

- పథకం అమలులో ప్రభుత్వం నాలుక మడత
- ఎన్నికల ముందు కుటుంబంలోని పిల్లలందరికీ పథకం వర్తిస్తుందని బాబు హామీ
- తాజాగా తల్లికి రూ.15 వేలు మాత్రమేనని జీఓ 29 విడుదల
- ఆందోళనలో తల్లిదండ్రులు



Scheme	Description
TALLIKI VANDANAM	As a part of Government Assured Flagship Programs, the Government under "TALLIKI VANDANAM" scheme is providing financial assistance of Rs.15,000/- per annum to each mother or recognized guardian who is below poverty line household and sending their children to schools/colleges i.e., from Classes I to XII.
STUDENT KITS	Under Vidya Kanuka, the Government school students of Classes I to XII are provided with the following benefits: (i) Bilingual Textbooks (English content on one page and Telugu version on the opposite page) (ii) Notebooks and Workbooks (iii) Three pairs of Uniforms with stitching charges (iv) A pair of Shoes and two pairs of Socks (v) A Belt and a School Bag (vi) Pictorial dictionary, Oxford dictionary

ప్రభుత్వం విడుదల చేసిన జీఓ


చాగలమర్రి ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు



టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టో

ఆళ్లగడ్డ /నంద్యాల(న్యూటౌన్): అమ్మ ఒడి పథకాన్ని పేరు మార్చి తల్లికి వందనం పేరుతో కూటమి ప్రభుత్వం కుటుంబంలోని చదివే పిల్లలందరికీ పథకాన్ని వర్తింపజేసి రూ.15వేలు అందజేస్తామని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి విస్తృతం ప్రచారం చేశారు. అలాగే జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సైతం వివిధ ప్రాంతాల్లో ప్రచారంలో ఈ అంశాన్ని ముఖ్యంగా ప్రస్తావించి హామీనిచ్చారు. అయితే ఆ హామీ ఒట్టిదేనని తేలిపోయింది. బుధవారం ప్రభుత్వం జారీ చేసిన జీఓలో తల్లికి కేవలం రూ.15వేలు మాత్రమే పథకం కింద అందిస్తామని పేర్కొన్నారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాడు అందరికీ ఇస్తామని హామీ.. నేడు ఒక్కరికే అని జీవో..

ఎన్నికల హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ ప్రకటించిన కూటమి.. అందులో ప్రధానమైన హామీ 'తల్లికి వందనం'. ఈ పథకం కింద ఎంత మంది పిల్లలు బడికి వెళ్తే అందరికీ రూ.15 వేల చొప్పున అందజేస్తామని ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జనవరి 9న ఆళ్లగడ్డలో నిర్వహించిన రా .. కదలిరా బహిరంగ సమావేశానికి హాజరైన చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. 'మీరు ఎంత మంది పిల్లలను చదివిస్తే వారందరికీ రూ.15 వేలు చొప్పున అందిస్తా.. ఒక్కరైతే రూ.15 వేలు, ఇద్దరుంటే రూ.30 వేలు, ముగ్గురు ఉంటే రూ.45 వేలు అందజేస్తామని, మీరు ఎంత మంది పిల్లలను అయినా కనండి వారి బాధ్యత నేను తీసుకుంటా' అని బహిరంగంగా హామీ ఇచ్చారు. ఎన్నికలు ముగిశాయి.. సీఎం సీట్లో కూర్చున్న బాబు మాట మార్చారు. ఇప్పుడు తాజాగా జీఓ 29 విడుదల చేశారు. అందులో పిల్లలను స్కూల్‌కి పంపే అమ్మలకు తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఆర్థిక సహాయం అంటూ మెలిక పెట్టడం చర్చనీయాంశమవుతోంది. ఒక్కో తల్లికి రూ.15 వేలు అని ప్రస్తావించడం ద్వారా ఒక్కరికే పథకం అందజేస్తారా అనే సందేహాలు మొదలయ్యాయి.

మరోసారి మోసపోయినట్లే..



పెద్ద కుమారుడు యువనాని 7వ తరగతి, చిన్నకొడుకు కార్తీక్ 3వ తరగతి స్థానిక ఎంపీపీ స్కూల్లో చదువుతున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక మాకు తల్లికి వందనం కింద రూ.30 వేలు వస్తుందని చెప్పుకున్నాం. బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన జీవో గురించి అందరూ మాట్లాడుకుంటున్నారు. ఇప్పుడు ఇద్దరి పిల్లలకు కాకుండా ఒకరికే ఇస్తారని ప్రభుత్వం చెప్పిందట.. అలా చేస్తే మేమంతా మరోసారి మోసపోయినట్లే. **– మల్లేశ్వరి, కోటపాడు**

అలా చేస్తే మోసం చేసినట్లే..



ఎన్నికల ముందు ఎంత మంది పిల్లలు చదివితే అందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తా.. మీ పిల్లల బాధ్యత నాది అని చంద్రబాబు హామీ ఇవ్వడంతో నమ్మి మేం మా ఇద్దరు పిల్లలను స్థానిక బర్డ్స్ ప్రైవేట్ స్కూల్‌లో చేర్పించాం. కూలి పనులు చేసుకుంటున్నా.. ప్రభుత్వం నుంచి రూ.30 వేలు వస్తుంది కదా అని అక్కడ చేర్పించాం . ఇప్పుడు రూ 15 వేలు మాత్రమే ఇస్తారని చెబుతున్నారు. అలా చేస్తే ప్రజలను మోసం చేసినట్లే. చెప్పిన మేరకు హామీ నెరవేర్చాల్సిందే.**– మేరీ,ముత్యాలపాడు**

ఎదురు చూస్తున్నాం



నంద్యాల పట్టణంలోని గోపాల్ నగర్‌లో ఉంటున్నాం. నాకు ఇద్దరు పిల్లలు. తల్లికి వందనం కింద రూ.30వేలు వస్తుందని ఎదురు చూస్తున్నా. చంద్రబాబునాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతున్నా అందరికీ ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున వేస్తామన్నారు. మా ముగ్గురు పిల్లలకు రూ.45వేలు వస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నాం. **–సురేఖ, విద్యార్థి తల్లి, నంద్యాల**

హామీ నెరవేర్చాల్సిందే..



నా పేరు గుండంపాటి దేవమ్మ. నంద్యాల మండలం చాబోలు గ్రామం. నాకు పెద్ద దస్తగిరమ్మ, చిన్న దస్తగిరమ్మ ఇద్దరు సంతానం. వారు ఊళ్లోని ప్రభుత్వ పాఠశాలలో 5, 2 తరగతులు చదువుతున్నారు. గత ప్రభుత్వంలో పెద్ద దస్తగిరమ్మకు అమ్మ ఒడి కింద రూ.15వేలు వచ్చేది. తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఎంత మంది పిల్లలు బడుల్లో చదువుతున్నా ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున తల్లి ఖాతాలో జమ చేస్తామన్నారు. అయితే ఇప్పుడేమో ఒక్కరికే అంటున్నారట.. ఇందెంత వరకు సమంజసం. హామీ మేరకు అమలు చేయాల్సిందే. **– జి.దేవమ్మ, చాబోలు**

ఆలస్యమవడం చూస్తే అనుమానమే..



పాఠశాలలు తెరిచే సమయానికి తల్లికి వందనం పథకం నగదు జమ అవుతుందని భావించాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పేరుతో రూ.15వేలు బ్యాంకు ఖాతాలో జమ అయ్యేవి. ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ తల్లికి వందనం పేరుతో పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి రూ.15వేలు చొప్పున తల్లి ఖాతాలో జమ చేస్తామని హామీ ఇచ్చింది. జూలై మాసం గడుస్తున్నా నగదు జమ కాలేదు. ఆలస్యం కావడం చూస్తుంటే అమలుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం స్పందించాలి. **– దూదేకుల కమాల్‌బీ, కానాల**

ఆశతో ఎదురు చూస్తున్నా..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం చెప్పిన సమయానికి తల్లి బ్యాంక్ ఖాతాలో జమ చేసేవారు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది చదువుతుంటే ఒక్కొక్కరికి రూ.15వేల ప్రకారం అందజేస్తామని చెప్పారు. మా ముగ్గురు పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చదివించుకుంటున్నాం. పాఠశాల యజమాన్యం ఫీజులు చెల్లించాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. తల్లికి వందనం పథకం ముగ్గురి పిల్లలకు వస్తుందని, ఆ సొమ్ముతో ఫీజులు చెల్లించాలని ఆశతో ఎదురు చూస్తున్నాం. **–షేక్ అలియా, కోటావీధి, నంద్యాల**

మాకు ముగ్గురు పిల్లలు..



ఇంటి వద్ద దోశల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తూ పిల్లలను చదివించుకుంటున్నా. ప్రభుత్వం అందించే తల్లికి వందనం పథకం మా పిల్లల చదువులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎదురు చూస్తున్నా. మా ఇంట్లో ఉన్న ముగ్గురు పిల్లలకు రూ.45వేలు వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నా. **– షబానా, చింతరుగు వీధి, నంద్యాల**

చదివించే స్థోమత లేక చదువు మాన్పించా



మాది గోస్పాడు గ్రామం. నాకు నలుగురు కుమార్తెలు సంతానం. ప్రస్తుతం ఇద్దరు కుమార్తెలు చదువుతున్నారు. ఇంకో ఇద్దరు ఇంటర్ పూర్తి కావడంతో చదివించే స్థోమత లేక చదువు మాన్పించాం. ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వస్తే తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది చదివితే ఒక్కొక్కరికి రూ.15వేలు అందజేస్తామని హామీ ఇచ్చారు. మా పిల్లల చదువులకు ఫీజులు, ఖర్చులకు ఎంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద డబ్బులు జమ చేస్తే రూ.30వేలు వస్తుందని, ఎప్పుడు అకౌంట్లలో జమ చేస్తారా అని ఎదురు చూస్తున్నాం. **– శేఖర్, గోస్పాడు**

'ఆదర్శ' బాలికలకు ట్రిపుల్ ఐటీలో సీటు




విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థిని మోమిన్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం.విజయలక్ష్మి

ఆళ్లగడ్డ: కోటకందుకూరు వద్దనున్న ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థినులు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజు తెలిపారు. ఇటీవల పదోతరగతి పూర్తి చేసిన జోత్స్నాదేవి, సమీర, తేజస్విని, హబీబా, వర్షిత మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఇడుపులపాయ ఐఐఐటీకి ఎంపికయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా గురువారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థినిలను అధ్యాపకులతో కలిసి అభినందించారు.

చాగలమర్రి: స్థానిక ఓరియంటల్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని మోమిన్ ట్రిపుల్ ఐటీకి ఎంపిందని హెచ్‌ఎం విజయలక్ష్మి తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆమె మాట్లాడతూ ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన పదవ తరగతి పరీక్షల్లో మోమిన్ 581 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిందన్నారు. మోమిన్ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం హర్షనీయమన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థినిని అభినందించారు.

అధిక జనాభా అభివృద్ధికి ఆటంకం


శిరివెళ్లలో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది


మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

శిరివెళ్ల: అధిక జనాభా అభివృద్ధికి ఆటంకమని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ముఖేష్ అన్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా సిబ్బందితో కలిసి ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచం జనాభాలో చైనా అగ్రగామిగా ఉందేదని, అయితే మనదేశం ఇటీవల ఆ దేశాన్ని దాటిపోయిందన్నారు. జనాభా పెరిగే కొద్ది మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. సీహెచ్‌ఓ రామ్మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల(న్యూటౌన్): జనాభా పెరగడం వల్ల వ్యవసాయంపై ఒత్తిడి పెరిగి నాణ్యమైన ఉత్పత్తులు తగ్గిపోయి ఆహార కొరత ఏర్పడుతుందని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో రామకృష్ణారెడ్డి అధ్యక్షతన ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తహసీల్దార్ మాట్లాడుతూ జనాభా నియంత్రణను సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. ప్రిన్సిపాల్ సుబ్బయ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రమణమ్మ, ఇంతియాజ్ పాల్గొన్నారు.

నంద్యాల(వ్యవసాయం): ప్రపంచ జనాభా దినోత్సవాన్ని స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లోని రావుస్ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ గెలివి సహదేవుడు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. క్లబ్ కార్యదర్శి శిరిగిరి రమేష్, కోశాధికారి మామిళ్ల నాగ రాజు, కళాశాల డైరెక్టర్ మౌని చంద్ర, ప్రిన్సిపాల్ సుంకయ్య పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ధ్యేయం


మాట్లాడుతున్న సీడీపీఓ తేజేశ్వరి

చాగలమర్రి: మహిళా సాధికారతే మిషన్ శక్తి సంకల్ప్ ధ్యేయమని, 2023లో ఏర్పాటైన మహిళా సాధికారత కేంద్రం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం కోసం పనిచేస్తుందని ఆళ్లగడ్డ ఐసీడీఎస్ సీడీపీఓ తేజేశ్వరి అన్నారు. గురువారం స్థానిక ఓరియంటల్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, సూపర్‌వైజర్ సుశీలమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిశోర బాలికల అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 9, 10వ తరగతి విద్యార్థినులనుద్దేశించి మాట్లాడుతూ యుక్త వయస్సు బాలికలు ఎమోషనల్, ఫిజికల్, సోషియల్, క్రియోటివిటీ, గణితాభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కలిగినప్పుడే సాధికారిత సాధించ గలుగుతారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుటుంబంలో ఒకరికే 'పీఎం కిసాన్'

దొర్నిపాడు: కుటుంబంలో ఎంత మంది పేరిట పొలాలు ఉన్నా ఒక్కరికి మాత్రమే పీఎం కిసాన్ పథకం వర్తిస్తుందని మండల వ్యవసాయాధికారి సునీత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ భూమి కల్గిన ఉన్న రైతుకు మాత్రమే పథకం సొమ్ము అందుతుందన్నారు. 2019 ఫిబ్రవరి 1 తర్వాత వ్యవసాయ భూమి కొనుగోలు చేసిన రైతులు అనర్హులనీ, కేవలం యజమాని మరణాంతరం వారసత్వంగా వచ్చిన వారే అర్హులన్నారు. అలాగే భూమిని దానం చేయడం, విక్రయించడం వంటివి చేస్తే భూ యాజమానిని అనర్హుడిగా గుర్తిస్తామన్నారు. ఉన్న భూమిని ఎవరికైనా తన పేరిట ఏమీ లేకుండా విక్రయించుకున్నా పీఎం కిసాన్ రాదని పేర్కొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): గ్రామ పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, సహాయ కార్యదర్శి బాల వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో గ్రామ పంచాయతీ వర్కర్లకు ఐదు నెలల నుంచి వేతనాలు రావడం లేదని, ఉద్యోగ భద్రత లేక చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించడం కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 20నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. స్వచ్ఛభారత్ కార్మికులకు 14, 15 ఫైనాన్స్ నిధులు వేతనాలు ఇవ్వాలని డీపీఓ ఆదేశించినా ఇవ్వడం లేదన్నారు.

గర్భిణులు, బాలింతలకు అవగాహన

రుద్రవరం: స్థానిక 7వ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు,బాలింతలకు గురువారం ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, ఎంఎల్‌హెచ్‌పీ హేమవతి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సంకల్ప్ వంద రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా మహిళలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, విశ్రాంతి, ఆరోగ్య పరీక్షలు, కాల్షియం మాత్రలు,బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్ణ,గుర్రమ్మ,ఆశా వర్కర్ ఉన్నారు.

13న ఎస్టీయూ కార్యవర్గ సమావేశం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా ఎస్టీయూ మొదటి కార్యవర్గ సమావేశాన్ని ఈనెల 13వ తేదీన బేతంచెర్లలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మౌలాలి, అజామ్‌బేగ్ తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై సమావేశంలో చర్చిస్తామన్నారు. ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రఘునాథరెడ్డి హాజరవుతారని చెప్పారు. గోపాలకృష్ణ, మనోహర్ రెడ్డి, ప్రభాకర్, మధుసూదన్, సోమయ్య పాల్గొన్నారు.


ఆర్.నాగులవరం చావిడిలో కొలువుదీరిన పీర్లు


గుండం తవ్విన దృశ్యం

మొదలైన మొహర్రం సందడి

రుద్రవరం: మండలంలో మొహర్రం సందడి మొదలైంది. గ్రామాల్లోని చావిళ్లను శుభ్రం చేయడం,పీర్లను కొలువు దీర్చడం, విద్యుద్దీపాలంకరణ గావించడం వంటివి చేపట్టారు. అలాగే ఆయా చావిళ్ల వద్ద అగ్ని గుండాలు తవ్వగా సాయంత్ర సమయంలో చిన్నారులు, యువకులు అక్కడ గుండం చుట్టూ తిరుగుతూ సందడి చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని ఆర్.నా గులవరంలో చావిడిలో గురువారం పీర్లను కొలువుదీర్చి, అగ్నిగుండం తవ్వారు. రుద్రవరంతో పాటు మంద లూరు, ఆలమూరు, కోటకొండ,నర్సాపురం,పెద్దకంబలూ రు,చిన్న కంబలూరు తదితర గ్రామాల్లో సందడి నెలకొంది.

ఉపాధి పనులపై విచారణ


విచారణ చేస్తున్న ఏపీడీ బాలాజీ నాయక్

గోస్పాడు: మండలంలోని నెహ్రూ నగర్ గ్రామంలో ఉపాధి పనులపై ఏపీడీ బాలాజీ నాయక్ గురువారం విచారణ చేపట్టారు. 18వ విడత సామాజిక తనిఖీలో నెహ్రూ నగర్ గ్రామంలో జరిగిన పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ లింగేశ్వర రెడ్డిపై వచ్చిన అభియోగాలపై విచారణ చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏపీడీ గ్రామంలో విచారణ చేపట్టారు. విచారణ నిమిత్తం ఏపీడి బాలాజీ నాయక్ గ్రామానికి వచ్చి విచారణ చేపట్టారు. గ్రామంలోని ఫిర్యాదుదారులు, వేతనదారులను విడివిడిగా విచారించారు. నివేదిక జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీకి అందజేస్తామని చెప్పారు. ఏపీఓ నాగజ్యోతి ,టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

హత్యాచార దుండగులను శిక్షించాలి


మాట్లాడుతున్న సాయిరాంరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో బాలికను అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు అత్యాచారం చేసి చంపిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ ఏఓ వెంకటేశ్వర్లుకు గురువారం వినతి పత్రం అందజేశారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు నారాయణమ్మ, లక్ష్మిదేవి, సుశీలమ్మ మాట్లాడుతూ మైనర్ విద్యార్థులు అఘాయిత్యానికి పాల్పడటం దుర్మార్గమన్నారు.

హత్య చేసిన వారిని శిక్షించాలి..

చిన్నారిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రీజనల్ కోఆర్డినేటర్ సన్నల సాయిరాంరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ 8సంవత్సరాల బాలికపై ముగ్గురు మైనర్ విద్యార్థులు అత్యాచారం చేసి చంపి మృతదేహన్ని ఎత్తిపోతల కాల్వలో పడేయడం తీవ్రంగా పరిగణించాలని, నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. సంపత్, చాంద్ పాల్గొన్నారు.



అధ్యాపకులతో చైర్మన్, ఎండీ

ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా

నంద్యాల(అర్బన్): అయ్యలూరు మెట్ట వద్దనున్న ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) స్వయం ప్రతిపత్తి (అటానమస్) హోదా ప్రకటించిందని కళాశాల చైర్మన్ వెంకటరామిరెడ్డి, ఎండీ దినేష్‌రెడ్డి గురువారం తెలిపారు. న్యాక్ గుర్తింపు, నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు పరిగణలోకి తీసుకున్న యూజీసీ అధికారులు స్వయం ప్రతిపత్తిని ప్రకటించారన్నారు. ఈ మేరకు కళాశాల అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కళాశాలకు గుర్తింపు రావడానికి అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కారణమని చెప్పారు. ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి, అకడమిక్ కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్‌రెడ్డి ఉన్నారు.